డ్రోన్‌తో పిచికారీ



కంగ్టి: బాన్సువాడలో డ్రోన్‌తో పంటకు రసాయనాల పిచికారీ

- పల్లెలకు విస్తరించిన వ్యవసాయ సాంకేతికత
- గంటలో ఐదారు ఎకరాల్లో పిచికారీ ..ఎకరాకు రూ.600 ఖర్చు

కంగ్టి(నారాయణఖేడ్): పల్లెలకు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం విస్తరించింది. రైతులు డ్రోన్‌లతో వరి పొలాల్లో రసాయనాలను పిచికారీ చేస్తున్నారు. గంటలో ఐదారు ఎకరాలు పిచికారీ చేయడం.. ఎకరాకు రూ.600 ఖర్చు అవుతుంది. దీంతో సమయం ఆదాతో పాటు కూలీల కొరతను అధిగమించే అవకాశం ఉంది. తక్కువ నీటితో ఎక్కువ పంటకు పిచికారీ చేసే వీలుంది. పైగా డ్రోన్ రెక్కల గాలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో పంటపై ఉన్న క్రిమి కీటకాలు సైతం నీటిలో పడి చనిపోతాయని రైతులు తెలిపారు. ఒక్క గంటలో ఐదారు ఎకరాలు పిచికారీ చేయవచ్చని డ్రోన్ నిర్వాహకులు తెలిపారు. ఎకరాకు రూ.600తో ఖర్చు అవుతుందన్నారు. పంటకు అవసరమైన సమయంలో పిచికారీ చేయడంతో పంట దిగుబడులు సైతం గణనీయంగా పెంచుకొనే అవకాశం ఉందని చెబుతున్నారు.

15 రోజుల ముందే రసాయనాలు తెచ్చా...



వరిలో పిలకలు వేసే దశలో మెడ విరుపు తెగులు, గింజ మచ్చ తెగులు సోకకుండా ఉండేందుకు 15 రోజుల ముందే రసాయనాలు తీసుకొచ్చా. కానీ పొలాల్లో వరి ఎత్తుగా ఎదగడంతో పాటు బురదలో నడవడం సాధ్యం కాకపోవడంతో పిచికారీ చేసేందుకు వీలు పడలేదు. దీంతో కామారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి నుంచి కిరాయికి డ్రోన్ తెప్పించి పిచికారీ చేశా.

–కాపర్తి ఆంజనేయులు, బాన్సువాడ, కంగ్టి మండలం

కూలీల కొరత అధిగమించవచ్చు



పంటలపై రసాయనాల పిచికారీకి కూలీల కొరత ఎక్కువ కావడంతో సకాలంలో క్రిమి సంహారకాలు, శిలీంద్రనాశిని రసాయనాలు, నీటిలో కరిగే పోషకాలు పంటలకు అందించలేక పోతున్నాం. తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ విస్తీర్ణంతో పిచికారీ చేయడంతో తక్కువ కూలీలతో పని చేసుకోవచ్చు. డ్రోన్‌లు మరింత ఎక్కువగా రైతులకు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉంది.

–జార మైపాల్‌రెడ్డి, బాన్సువాడ, కంగ్టి మండలం

క్లుప్తంగా

హరీశ్‌రావును కలిసిన మాజీ ఎమ్మెల్యే



హరీశ్‌రావుతో మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కుమ్మరి పరమేష్‌తో కలిసి బుధవారం మాజీమంత్రి హరీశ్‌రావును ఆయన నివాసంలో కలిశారు. శాలువాతో సన్మానించి, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఖేడ్ ప్రాంత విషయాలపై చర్చించారు.

విద్యార్థినులకు రగ్గుల పంపిణీ



రగ్గులను పంపిణీ చేస్తున్న రవీందర్‌రెడ్డి తదితరులు

న్యాల్‌కల్(జహీరాబాద్): స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం జిల్లా కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్, మండల ప్రత్యేక అధికారి కె.రవీందర్‌రెడ్డి విద్యార్థినులకు రగ్గులు పంపిణీ చేశారు. సిగ్నోడ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో రగ్గులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజశేఖర్, ఎంపీఓ సురేష్, విద్యాలయం ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న నారాయణ

జహీరాబాద్ టౌన్: చిన్నారి వైద్యం కోసం ఎమ్మెల్యే మాణిక్‌రావు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.1.50 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఈ మేరకు బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు బీఆర్‌ఎస్ తట్టు నారాయణ ఎల్‌ఓసీని అందజేశారు. మండలంలోని హుగ్గెల్లికి చెందిన గొల్ల విష్ణు అనురాధ దంపతులకు 14 నెలల పాప ఉంది. పాప గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, బాధితులు ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని ఎల్‌ఓసీని మంజూరు చేయించారు.

ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయండి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: ఏకపక్షంగా ఎన్నుకున్న ఇందిరమ్మ గ్రామకమిటీలను రద్దు చేయాలని బీఆర్ఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో సభలు, సమావేశాలు నిర్వహించకుండా ఇందిరమ్మ గ్రామ కమిటీలను ఎలా వేస్తారని ప్రశ్నించారు. అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ.. ఒకే వర్గం వారితో కమిటీ వేస్తున్నారని మండిపడ్డారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పార్టీ నాయకులు సొసైటీ చైర్మన్ మచ్చెందర్, నాయకులు బస్వరాజ్, చిన్నపటేల్, జగదీశ్వర్, హీరు రాథోడ్, అమిత్‌కుమార్, గులాబ్ సింగ్, రాములు, ప్రేమ్ బాణోత్, చంద్రకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించండి



చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చింతాగోపాల్ తదితరులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని గొల్లగూడెం సదాశివపేట బైపాస్ రోడ్డు జంక్షన్ సమీపంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ కాంస్య విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని అధికారులు కోరారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు మున్సిపల్ వైస్ చైర్మన్ చింతాగోపాల్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చింతాఆనంద్ కలిసి వినతిపత్రం అందజేశారు. స్థలం కేటాయింపు గురించి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందిందని, కావున స్థలం కేటాయించాలని కోరారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ, యాజమాన్యాలు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ డిమాండ్ చేశారు. రెండు రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాలు నిర్వహిస్తున్న సమ్మెకు పీడీఎస్‌యూ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సమ్మెలో భాగంగా బుధవారం సంగారెడ్డిలోని టీటీడీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. నిరసన వ్యక్తం చేస్తున్న వారిని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఓయూ, కేయూ యూనివర్సిటీల పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాల యాజమాన్యాలు నిరవధికంగా కళాశాల బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. బంద్ వల్ల పేదల విద్యార్థుల చదువు ఆగమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే ప్రభుత్వం కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టమైన హామీని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్ ,డివిజన్ నాయకులు అనిల్ , సిద్దేశ్వర్ ,సాత్విక ,శివ, దినేష్, శ్రీకాంత్, హర్షిత్, అశ్విని ,పల్లవి, రోషిని, శ్రీనిధి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

విధుల్లో చేరిన కొత్త సార్లు



నియామకపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

న్యాల్‌కల్(జహీరాబాద్): కొత్త ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ మారుతిరాథోడ్‌కు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం వారు తమకు కేటాయించిన పాఠశాలలకు వెళ్లారు. మండలానికి 36 మంది కొత్త ఉపాధ్యాయులు వచ్చారని వారంతా విధుల్లో చేరినట్లు ఎంఈఓ తెలిపారు.

60 మంది ఉపాధ్యాయులు చేరిక

కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధ్యాయ పోస్టుల నియామకంలో కంగ్టి మండలానికి 61 మంది ఉపాధ్యాయులను కేటాయించారు. బుధవారం వారు విధుల్లో చేరినట్లు ఎంఈఓ మహ్మద్ రహీమొద్దిన్ తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 49 మంది ఎస్‌జీటీలకు గాను 48 మంది జాయినింగ్ రిపోర్టులు సమర్పించారు. ఒక్కరు విధుల్లో చేరలేదు. తడ్కల్ ఉన్నత పాఠశాలలో 5 గురు, కంగ్టి ఉన్నత పాఠశాలలో 7 గురు స్కూల్ అసిస్టెంట్లు జాయినింగ్ ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు.

పొగాకు ఆరోగ్యానికి హానికరం



అవగాహన కల్పిస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి

నారాయణఖేడ్: పొగాకు ఉత్పత్తుల వాడకం ఆరోగ్యానికి హానికరమని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సూపర్‌వైజర్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం ఖేడ్ మండలం చాప్టా(కె) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, గ్రామ ప్రధాన కూడళ్లల్లో యువకులకు జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. పొగాకు ఉత్పత్తులైన బీడీ, చుట్ట, సిగరెట్, జర్దా, తంబాకు, పాన్ మసాలా లాంటివి వినియోగించరాదన్నారు. వాటివల్ల కలిగే అనర్థాలను వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే రూ.200 జరిమానా తప్పదన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నర్సింహులు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఈశ్వరయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మారుతి, బాబు రావు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై సమీక్ష

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధి హామీ పథకం పనులపై బుధవారం ఎంపీడీఓ రమేష్‌బాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. కొత్తగా నర్సరీలు ఏర్పాటు చేయాలని సెక్రటరీలు, ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు.

ఓటు నమోదు తప్పనిసరి

కల్హేర్(నారాయణఖేడ్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కొత్త ఓటర్లకు అవకాశం కల్పిస్తామని కల్హేర్ తహసీల్దార్ శివశ్రీనివాస్ పేర్కొన్నారు. కల్హేర్ తహసీల్దార్ కార్యాలయంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదుకు కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నవంబర్ 6 లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

జీరో బిల్లులు అందజేస్తాం

సాక్షి ఎఫెక్ట్..

వట్‌పల్లి(అందోల్): మండలంలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో విద్యుత్ సిబ్బంది ప్రతినెల మీటరు రీడింగ్ తీయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. రెండు, మూడునెలలకొక సారి రీడింగ్ తీయడంతో వేలల్లో బిల్లులు వస్తూ గృహ జ్యోతి పథకానికి దూరమవడంపై ఈనెల 11న 'గుండె గుబిల్లు' అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై విద్యుత్ అధికారులు స్పందించారు. లబ్ధిదారులు బిల్లులతో తమను సంప్రదిస్తే రద్దు చేసి జీరో బిల్లులు అందజేస్తామని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని కొత్తచెరువులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొచ్చారు. మృతుడి జేబులో థర్మకోల్ ముక్కలు ఉండడంతో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



మొక్కలు నాటుతున్న శాస్త్రవేత్తలు

సంగారెడ్డి టౌన్ : విద్యార్థులు నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం డీఎస్‌ఏ సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని పసల్వాది గ్రామంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్య నియమాలను పాటిస్తూ వ్యవసాయంపై విజ్ఞానం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ మాణిక్యం, వ్యవసాయశాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దైవచింతనతోనే ముక్తి



విగ్రహ ప్రతిష్ఠలో మాధవానంద సరస్వతీ

హత్నూర(సంగారెడ్డి): దైవచింతనతోనే ముక్తి లభిస్తుందని మాధవానంద సరస్వతీ స్వామీజీ అన్నారు. బుధవారం హత్నూర మండలం కాసాల గ్రామంలో దుర్గమ్మ, ఊరడమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. అనంతరం మాధవానంద సరస్వతీ స్వామీజీ భక్తులకు ప్రవచనాలు బోధించారు. నా అనే గర్వం వీడి అందరూ బాగుండాలని కోరుకోవాలన్నారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న అమ్మవార్ల విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో చివరి రోజు ఏకాదశి, శుభ ముహూర్తానా యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, హోమాలు, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద కార్యక్రమాలు చేశారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మెదక్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దుర్గామాత అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

భారతి సిమెంట్‌తో నిర్మాణం వేగవంతం



మేస్త్రీలతో భారతి సిమెంట్ అధికారులు

సంగారెడ్డి టౌన్ : భారతి సిమెంట్‌తో నిర్మాణం వేగవంతంగా పూర్తవుతుందని భారతి సిమెంట్ టెక్నికల్ సర్వీసెస్ మేనేజర్ సునీల్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీ సాయి బాలాజీ ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీమేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని పేర్కొన్నారు. వికాట్ గ్రూపుకి చెందిన భారతీ సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందని, వికాట్ గ్రూప్ కంపెనీస్ ప్రపంచంలో 12 దేశాల్లో విస్తరించి ఉన్నాయని తెలిపారు. ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడుతారని తెలియజేశారు. అనంతరం మేస్త్రిలందరికీ రూ. లక్ష ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజింగ్ మార్కెటింగ్ సతీస్‌కుమార్ , టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్, డీలర్ కృష్ణ కాంత్, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో అధిక దిగుబడులు

శాస్త్రవేత్త డాక్టర్ మానే



మాట్లాడుతున్న శాస్త్రవేత్త మానే

న్యాల్‌కల్(జహీరాబాద్): ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని పూణేలోని వసంత దాదో షుగర్ ఇనిస్టిట్యూట్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానే అన్నారు. మండలంలోని మామిడ్గి గ్రామంలో బుధవారం చెరకు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానే మాట్లాడుతూ.. పాత పద్ధతులతో కాకుండా నూతన పద్ధతుల ద్వారా పంటలు పండిస్తే మంచి దిగుబడులు, లాభాలు వస్తాయన్నారు. ఫ్యాక్టరీ చైర్మన్ సచిన్ గోయాలు మాట్లాడుతూ.. వచ్చే నవంబర్ మాసంలో ఫ్యాక్టరీని ప్రారంభించి 2500 మెట్రిక్ టన్నుల చెరకును క్రస్సింగ్ చేస్తామన్నారు. సమావేశంలో కేన్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఫీల్డ్‌మెన్ శ్రీనివాస్, రైతులు మల్‌రెడ్డి, తుక్కారెడ్డి, మల్లికార్జున్, నర్సారెడ్డి, సంతోష్, రాజిరెడ్డి, సంజీవరెడ్డి, శ్యామప్ప తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి



ఆవులకు టీకాలు వేస్తున్న పశువైద్యులు

పటాన్‌చెరు టౌన్: పశుపోషకులు పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని వసంతకుమారి అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామ పరిధిలోని గోశాలలో పశువైద్య సిబ్బందితో కలిసి పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వసంతకుమారి మాట్లాడుతూ.. పశువైద్య శాఖ అందిస్తున్న టీకాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గోశాలలో 388 ఆవులకు వ్యాక్సిన్ వేశామని తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది శ్రీకాంత్, శ్రావణ్, సర్దార్, చంద్రశేఖర్, సుజాత, చక్రవర్తి పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

- పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

పటాన్ చెరు టౌన్: నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని రౌడీషీటర్లను పటాన్ చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం పటాన్‌చెరు డీఎస్పీ కార్యాలయంలో పాత రౌడీషీటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రౌడీ షీటర్లు ఎలాంటి గొడవల్లో తలదూర్చొద్దన్నారు. నేరాలకు పాల్పడకుండా ఉంటే రౌడీషీట్ రద్దు చేస్తామని తెలిపారు. పోలీసుల నిఘా రౌడీ షీటర్లపై ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి, క్రైమ్ సీఐ రాజు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఘనంగా గర్భన్యాస కౌముది వ్రతం**

సంగారెడ్డి టౌన్ : మండలంలోని ఫసల్వాది శివారులోని జ్యోతిర్వాస విద్యాపీఠంలో గర్భన్యాస కౌముది వ్రత మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి వైదిక పర్యవేక్షణలో గర్భాన్యాస కార్యక్రమం జరిపించారు. గర్భన్యాస కార్యక్రమాన్ని తిలకించడం వల్ల కలిగే ఫలితాన్ని భక్తులకు వివరించారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

◆ **పారదర్శకంగా ఉండాలి**

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): ఇందిరమ్మ కమిటీల ఎంపిక పారదర్శకంగా ఉండాలని బుధవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎంపీడీఓ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో అన్ని వర్గాలకు తగిన ప్రాధాన్యం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రెడ్డి, నాయకులు నరేష్ గౌడ్, విఠల్ రెడ్డి, సుధాకర్, దశరథ్, అశోక్ పాల్గొన్నారు.

◆ **పైపులైన్‌కు మరమ్మతులు**

మునిపల్లి(అందోల్): మండలంలోని బుస్సారెడ్డిపల్లి గ్రామం శివారు నుంచి బుదేరాకు ఉన్న మిషన్‌భగీరథ పైపులైన్‌కు క్రాక్ ఏర్పడింది. గుర్తించిన అధికారులు వెల్డింగ్ చేయడానికి పైపులోని నీళ్లను బయటకు పంపించారు. పైపులైన్ వాల్ నుంచి ఒక్కసారిగా నీళ్లు ఎగిసిపడ్డాయి. త్వరలో మరమ్మతులు (వెల్డింగ్) చేసి ప్రజలకు తాగు నీటిని సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అంగద్ తెలిపారు.

◆ **కఠినంగా శిక్షించాలి**

సంగారెడ్డి ఎడ్యుకేషన్: దేవతల విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి, కఠినంగా శిక్షించాలని బీజేపీ, వీహెచ్‌పీ, హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డిలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సదాశివపేట పట్టణంలో హనుమాన్ మందిరంలో హనుమాన్ విగ్రహంతో పాటు వినాయకుని విగ్రహాలు ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

◆ **అభివృద్ధి లక్ష్యంగా ప్రజాపాలన**

పటాన్‌చెరు: గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, మంత్రి దామోదర రాజ నర్సింహ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ఇందుకు అనుగుణంగా నూతన రహదారుల నిర్మాణం, బ్రిడ్జిల నిర్మాణానికి రూ.20 కోట్ల 80 లక్షల మంజూరు చేసిందని తెలిపారు. త్వరలో టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామ న్నారు.

◆ **విద్యార్థులకు సన్మానం**

కంగ్టి(నారాయణఖేడ్): నీట్ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సీట్లు పొందిన విద్యార్థులకు బుధవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజానర్సింహా సన్మానించారు. కంగ్టికి చెందిన సిర్మా అఖిలరెడ్డిని శాలువాతో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి ఉన్నారు.

◆ **యువకుడి అదృశ్యం**

పటాన్‌చెరు టౌన్: ఓ యువకుడు అదృశ్యమైన ఘటన అమీన్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ దుర్గయ్య కథనం ప్రకారం.. డిఫెన్స్ కాలనీలో ఉండే చాకలి బిచ్చయ్య అమీన్పూర్‌లోని ఓ హోటల్లో పని చేస్తున్నాడు. ఈ నెల 9వ తేదీన మధ్యాహ్నం హోటల్ నుంచి బయటికి వెళ్లి తిరిగి విధులకు రాలేదు. నాడెడ్ బాడీ మోమిన్‌పేట్ వెళ్తోందని హోటల్ యజమానికి మెసేజ్ పంపించాడు. దీంతో హోటల్ యజమాని యువకుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు విషయం చెప్పాడు. యువకుడి తల్లి పాపమ్మ ఆ రోజు నుంచి బిచ్చయ్య కోసం తెలిసినవారి వద్ద, బంధువుల వద్ద వెతికింది. 14వ తేదీ ఫోన్‌లో చేసి ఇంటికి వస్తానని చెప్పి ఫోన్ స్విచాఫ్ చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ **స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని వినతి**

జహీరాబాద్ టౌన్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. ఆచార్య, వశిష్ట డిగ్రీ కళాశాలల చైర్మన్లు వెంకట్‌రాంరెడ్డి, డాక్టర్ సిద్దారెడ్డి మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి చదువుతుంటారని, బకాయిలు ఉండడం వల్ల వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మూడు సంవత్సరాల నుంచి బకాయిలు ఉన్నాయని తెలిపారు.